క్లుప్తంగా

నేడు మండల సమావేశం

వల్లూరు: మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల అధ్యక్షురాలు అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వ్యవసాయం, తాగునీరు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, పారిశుధ్యం, విద్య, వైద్య మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల కో ఆప్షన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు జూలై నెల 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎల్‌ఏ సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణంలోని సీఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌లో నాలుగవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులకు క్రీడల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని ఆయన తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో 5వ తరగతి చేరే విద్యార్థులకు ఇదొక చక్కటి అవకాశం అని, ఈ అవకాశాన్ని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. తన వద్ద శిక్షణ పొందిన 10 మంది విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందారని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు 98497 20930 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన అన్నారు.

డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

గోపవరం : మండల వ్యాప్తంగా డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ తెలిపారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడుతున్నందున తాగునీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామ పంచాయతీ, వైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో తాగునీటి పథకాలను శుభ్రపరచాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా మురికినీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా వ్యాధి ప్రబలితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

27న మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం: ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఈనెల 27న ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రాదేశిక స్థానాలకు సంబంధించిన ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆమె తెలిపారు. అలాగే అన్ని శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

సాధారణ సమావేశం 25కు వాయిదా

కమలాపురం: ఈనెల 24న జరగవలసిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం 25వ తేదీకి కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. 25న ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఇండోర్, ఔట్‌డోర్ సిబ్బంది హాజరు కావాలని ఆయన తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం డి.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. డ్యాన్స్ మాస్టర్ కిషోర్, యువరాజ డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ కిషోర్, పరిపాలన అధికారి సుధాకర్, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు మించిన ఆస్తి లేదు

ప్రొద్దుటూరు కల్చరల్ : తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాల్సిన పెద్ద ఆస్తి చదువే అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక బుశెట్టి కల్యాణ మండపంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు మించిన ఆస్తి ఏది లేదని, తల్లిదండ్రులకు తమ పిల్లలను చక్కగా చదివించి ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషి చేయాలన్నారు.

వర్షం కురిసె.. విత్తుకు వేళాయె



మండలంలో విత్తన సాగుకు పొలంను సిద్ధం చేస్తున్న రైతు

- ఇటీవల కురుస్తున్న వర్షాలు
- ఖరీఫ్ ప్రారంభం కావడంతో పొలం పనుల్లో రైతన్నలు బిజీ

ఎర్రగుంట్ల: ఈ ఏడాది ముందస్తుగా కురిసిన వర్షాలకు రైతులు ముంగారు సేద్యాలు చేసి, సాగుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అదునులో పదునైన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా వేరుశనగ సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జూలై ఆఖరు వరకు విత్తన సాగు చేసుకునేందుకు అనుకూలమని వ్యవసాయాధికారులు తెలిపారు.

ట్రాక్టర్ సేద్యాలకు రైతులు మొగ్గు..

విత్తన సాగుకు, ముంగారు సేద్యం పనులకు గతంలో కాడెద్దులు తప్పనిసరి. ప్రతి ఇంటా కాడెద్దులు ఉండేవి. అయితే రానురానూ కాడెద్దులు కనుమరుగవుతున్నాయి. ధరలు పెరిగిపోయి, ఎద్లను పోషించలేని పరిస్థితి. రెడీమేడ్‌గా ట్రాక్టర్ సేద్యాలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు బాడుగలు చెల్లించాలి. ట్రాక్టర్ యజమాను విత్తన సాగుకు గంటకు రూ.2 వేలు నుంచి రూ.2500 వరకు అద్దె తీసుకుంటున్నారు. ఈ లెక్క ప్రకారం సగటున ఐదెకరాలు పొలంలో ఎరువులు, సేద్యం పనులకు సుమారుగా రూ.35 వేలు, నుంచి రూ.40 వేలు వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

జూలై అఖరి వరకు సాగుకు అనుకూలం



ఖరీఫ్ సీజన్‌లో జూలై ఆఖరు వరకు వేరుశనగ విత్తుకోవచ్చు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. తేమ ఆరిపోతుందనే ఆందోళన చెందకుండా రైతన్నలు సాగు చేసుకోవచ్చు. వేరుశనగతో పాటు చిరుధాన్యాల పంటల సాగు చేసుకోవచ్చు. రైతులకు అవసరమైన సందేహాలను నివృత్తి చేసేందుకు ఆయా గ్రామాలలోని వ్యవసాయ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఆర్‌బీకేలో సేవలను రైతులు వినియోగించుకోవాలి.

–శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, ఎర్రగుంట్ల మండలం

చీనీకి తెగుళ్లు.. రైతులకు కన్నీళ్లు



తెగుళ్లు సోకడంతో చీనీచెట్లు నరికేసిన రైతన్నలు

తెగుళ్లతో చెట్లను నరికేస్తున్న రైతులు

సింహాద్రిపురం: మండలం రాయలసీమ ప్రాంతంలోనే చీనీసాగుకు ఎంతో ప్రసిద్ధి గాంచింది. అందులో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సింహాద్రిపురం మండలం చీనీ సాగులో మొదటిస్థానంలో ఉందని చెప్పవచ్చు. మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన చీనీచెట్లకు తెగుళ్లు సోకడంతో రైతులు కన్నీళ్లు పెడుతున్నారు. మండల వ్యాప్తంగా 18వేల ఎకరాల్లో చీనీ పంట సాగవుతోంది. రెండు సంవత్సరాల నుంచి అధిక వర్షం పడటంతో భూములు జౌకులెత్తి తేమ ఆరకపోవడం వల్ల వేరుకుళ్లు, బంక తెగుళ్లతో పాటు పులుసు పురుగులు ఆశించడం వల్ల చీనీచెట్లు తెగుళ్ల భారినపడి ఎండిపోతున్నాయని రైతన్నలు వాపోతున్నారు. కాపునకు వచ్చే సమయంలో చీనీచెట్లు తెగుళ్ల భారినపడి చనిపోతుండటంతో ఆ చెట్లను విధిలేని పరిస్థితుల్లో నరికేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లు బారిన పడిన చీనీచెట్లకు వేల రూపాయలు ఖర్చు చేసి పురుగు తెగుళ్ల నివారణకు పురుగు మందులు వాడినా కూడా కొంతమంది రైతులు పండించిన పంటలకు తెగుళ్లు సోకినా కూడా విధిలేని పరిస్థితుల్లో చీనీచెట్లు నరికేస్తున్నారు. ప్రస్తుతం చీనీకాయలు టన్ను ధర రూ.30 వేలు పలుకుతోంది. సాగు చేసిన పంటలకు పెట్టుబడులు కూడా రాలేదని రైతులు దిగాలుచెందుతున్నారు. తెగుళ్లు సోకి చెట్లు తొలగించిన రైతులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చీనీమొక్కలను ఉచితంగా అందించాలని రైతులు కోరుతున్నారు.

సమాజ సేవ కోసమే గ్రేటర్ వాసవీ క్లబ్



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

కమలాపురం: సమాజ సేవ చేయడం కోసమే గ్రేటర్ వాసవీ క్లబ్‌ను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ప్రజలకు సేవలందిస్తున్న స్థానిక పోలీస్ శాఖ సిబ్బంది వాసు, పుల్లయ్యలను వారు సన్మానించారు. అలాగే 10 మంది చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. వృద్ధులకు చేతి కర్రలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ వాసవీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే పోలీస్ సిబ్బందికి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రతి ఏటా తమ క్లబ్ ద్వారా డాన్ టు డస్క్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఏదో ఒక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది చేతి కర్రలు, గొడుగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ స్థానిక, ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ఘననివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

పులివెందుల టౌన్: అఖండ భారతావని స్థాపన కోసం నిస్వార్థంగా కృషిచేసి బలిదానం కాబడిన దేశభక్తుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక విద్యాధరి పాఠశాల ఆవరణలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 23న బలిదాన్ దివాస్ కార్యక్రమం శ్యాంప్రసాద్ సంస్మరణ దినంగా జరుపబడుతుందన్నారు. భారతీయ జన సంఘ స్థాపన చేసి కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని నినాదించి నెహ్రూతో విభేదించి ×ఒకే దేశం ఒకే జెండా ఒకే విధానం₹ అనే విధానంతో ఖండ భారతావనిని అఖండ భారతావనిగా రూపుదిద్దుకోవడంలో కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె: జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్థంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ నెహ్రూ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో భారతదేశం నుంచి కాశ్మీర్‌ను విడదీస్తూ తెచ్చిన ఆర్టికల్ 370ని రద్దు చేయాలని కోరుతూ పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ తన పదవికి రాజీనామా చేసి ఒకే దేశంలో రెండు జాతీయ జెండాలు, రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు (ఏక్ దేశ్‌మే దో నిషాన్, దో విధన్, దో ప్రధాన్ నహీచలేంగే) అంటూ నినదించిన వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు. అఖండ భారతదేశం కోసం బలిదానం అయిన వ్యక్తి ముఖర్జీ అన్నారు. భారతీయ జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖర్జీగారి కలలను నిజం చేస్తూ నరేంద్ర మోదీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఆర్టికల్ 370ని రద్దు చేసి కాశ్మీర్‌ను భారత భూభాగంలో కలపడం జరిగిందన్నారు. సమైఖ్య భారతం కోసం తన ప్రాణాలను త్యజించిన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్థంతిని బలిదివాన్ దివస్‌గా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుస్మా, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జోక్యం చేసుకుంటే చర్యలు తీసుకోండి



ఎస్ఐ ధనుంజయుడుకు కంపెనీ ఆర్డర్ కాపీని అందజేస్తున్న రామలింగారెడ్డి

వేముల: టిఫెన్ బెరైటీస్ కంపెనీకి సంబంధించి ఆస్తులన్నింటికి కేర్ టేకర్‌గా ఉన్నానని, ఈ కంపెనీ వ్యవహారంలో ఎవరైనా జోక్యం చేసుకుంటే చర్యలు తీసుకోవాలని మండలంలోని వేల్పుల గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి ఎస్ఐ ధనుంజయుడుని కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం టిఫెన్ బెరైటీస్ కంపెనీ ఇన్‌సోల్‌వెంట్స్ ప్రొఫెషనల్ వాసుదేవన్ చెన్నైలోని ఎంసీఎల్టీ మార్చి 12, 2018వ సంవత్సరం ఇచ్చిన ఆదేశాల మేరకు టిఫెన్ బెరైటీస్ ఆస్తులతో పాటు, మైనింగ్, బెరైటీస్‌లపై రామలింగారెడ్డిని కేర్ టేకర్‌గా నియమిస్తూ ఇచ్చిన ఆర్డర్‌ను ఎస్ఐకి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కడప, వేముల, తదితర ప్రాంతాల్లో టిఫెన్ బెరైటీస్ కంపెనీకి సంబంధించి ఆస్తులన్నింటిని చూసుకునే బాధ్యత నాపై ఉంచి కేర్ టేకర్‌గా నియమించడం జరిగిందన్నారు. ఇతరులు ఎవరైనా జోక్యం చేసుకుంటే చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరడం జరిగిందన్నారు. ఈ ఆస్తులన్నింటికి తాను బాధ్యతగా ఉన్నందున ఇతరులు ఎవరూ ఆక్రమించకుండా, వాటిపై పెత్తనం చెలాయించకుండా చూడాలని, అలా ఎవరైనా అతిక్రమించి వ్యవహరిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో ఎస్టీయూ పాత్ర అద్వితీయం



ఎస్టీయూ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి

పులివెందుల టౌన్: ఉపాధ్యాయ ఉద్యమ పథంలో ఎస్టీయూ పాత్ర అద్వితీయమని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో నూతన సొంత భవనంలో ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్టీయూ తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎనలేని కృషి చేసిందన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘంలోని ఆనాటి నేత వీణా విజయరామరాజు నుంచి నేటి నేత కత్తి నరసింహారెడ్డి వరకు వారి పాత్ర అసమాన్యమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, మాజీ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి, వైఎస్సార్ జిల్లా ఎస్టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పులివెందుల ప్రాంత ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు మరిన్ని సేవలు



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

జమ్మలమడుగు: రోటరీక్లబ్బు ఆధ్వర్యంలో పేదలకు మరిన్ని సేవలను అందించేందుకుగా కృషి చేయడం జరుగుతుందని రోటరీ క్లబ్బు అధ్యక్షుడు న్యాయవాది మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ డిగ్రీ కాలేజి ప్రాంగణంలో ఉచిత కంటివైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్బు ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత కంటి పరీక్షలను చేపట్టి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు సైతం చేయించేబాధ్యత తీసుకోవడం జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటన చేసి నిరుపేదలకు, వారి పిల్లలకు కావలసిన సౌకర్యాలను సైతం సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో పి.నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, కుండాభాస్కర్, ఓబుళరెడ్డి బంగారు శ్రీనివాసులు, సంజీవ రాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సంగిరెడ్డి మృతి



పులివెందుల రూరల్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సమీప బంధువు నర్రెడ్డి సంగిరెడ్డి(82) ఆదివారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. సంగిరెడ్డి జియాలజిస్ట్ గా పని చేస్తూ రిటైరయ్యారు. ఈయన వైఎస్ కుటుంబసభ్యులతో సత్సంబంధాలు కలిగి ఉండేవాడు. సంగిరెడ్డి మృతి పట్ల వైఎస్ కుటుంబ సభ్యులు, బంధువులు సంతాపం తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

తొండూరు: మండలంలో ప్రతీ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార నివేదిక కార్యక్రమం నిర్వహిస్తారని తొండూరు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని వారి సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

వృద్ధాశ్రమాలలో అన్నదానం



చిలంకూరు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మూలె వెంకటసురేంద్రనాథ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని ఎర్రగుంట్ల, చిలంకూరు, తిప్పలూరు గ్రామాలలో ఉన్న మూడు అనాథ వృద్ధాశ్రమాలలో ఆయన కుటుంబ సభ్యులు, మిత్ర బృందం కలసి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. తిప్పలూరులోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథ ఆశ్రమం, చిలంకూరులోని శ్రీరాజరాజేశ్వరీ వృద్ధాశ్రమం, ఎర్రగుంట్లలోని బాలాజీ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మూలె లిఖిత సురారెడ్డి, మల్లు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా పౌర్ణమి ఉత్సవాలు



గంగమ్మకు దీపాలతో ఆరాధన చేస్తున్న మహిళలు

జమ్మలమడుగు: పట్టణంలోని కన్నెలూరులో వెలసిన గంగమ్మతల్లికి భక్తులు ఘనంగా పౌర్ణమి ఉత్సవాలను నిర్వహించారు. ఇటీవల 70 సంవత్సరాల తర్వాత గంగమ్మ దేవర నిర్వహించిన గ్రామస్థులు ఏరువాక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నెలూరులోని శ్రీచౌడేశ్వరిదేవి కోలాట బృందం నృత్యాలు, కోలాటం భక్తులను అలరించాయి.

అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అంకాలమ్మతల్లి అమ్మవారు

సింహాద్రిపురం: మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుని బోనాలు పట్టారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

కంప్యూటర్, ట్యాలీలలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్ లేదా ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. 35 రోజులపాటు బెంగుళూరులో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లిషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కడప రూరల్: ఎన్డీఏ కూటమి ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేపడుతామని హామీ ఇచ్చాయని. ఇచ్చిన మాట ప్రకారం వర్గీకరణను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎన్ రాజా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఈదుముడిలో జూలై 7న నిర్వహిస్తున్న మాదిగల జన జాతర సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగులయ్య, ఉపాధ్యక్షులు కనకరాజు, కార్యదర్శి వెంకటేష్, కడప నగర అధ్యక్షులు శంకర్ పాల్గొన్నారు.

పట్టు తప్పితే ప్రమాదమే..



వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న కూలీలు



ఆటో వెనుక వేలాడుతూ ప్రయాణిస్తున్న యువకులు

పులివెందుల రూరల్: నియోజకవర్గంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేకపోవడంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అలాగే కూలీ పనులు చేసే కూలీలు కూడా అనంతపురం, ధర్మవరం ప్రాంతాల నుంచి పనుల కోసం పులివెందుల నియోజకవర్గంలోని పలు గ్రామాలకు ఆటోలలోను, వాహనాల్లో అధిక లోడ్‌తో ప్రయాణం చేస్తూ ప్రాణాలు కొనితెచ్చుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ అవసరాల నిమిత్తం తప్పక ఆటోలో ప్రయాణం చేస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆటోవారు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. అలాగే కొంతమంది మైనర్లు కూడా ఆటోలు నడపడంతో పాటు అతివేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆటో ప్రమాదాలే అధికం :

రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా అధిక సంఖ్యలో ఆటో ప్రమాదాలే జరుగుతున్నాయి. ఆర్టీసీ అధికారులు మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ఆటోల్లో అధిక లోడ్‌తో ప్రయాణాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టి ప్రమాదాలను కొంతవరకైనా తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

జోరుగా సేద్యం

ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు రైతన్నలు సేద్యం పనులు మొదలుపెట్టారు. నైరుతి రుతుపవనాల రాకతో వారం రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు రైతులు పొలాల్లో విత్తనం వేసే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే రైతన్నలు పంటల సాగుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

–పులివెందుల రూరల్



కలుపుతీత పనులు చేపట్టిన రైతన్న